క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం



అలంకరణలో స్వామి ఉత్సవ విగ్రహం

భీమునిపట్నం : భీమిలి సౌమ్య గిరిపై ఉన్న నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాల అభిషేకాలు, గంగ, నర్మద, గోస్తనీ నదుల జలాలతో అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రావెల్ తరలించే వాహనాలు సీజ్ చేయండి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కాపులుప్పాడ, కె.నగరపాలెం, తిమ్మాపురం ప్రాంతాల్లో కొందరు సెలవు దినాల్లోనూ, రాత్రి సమయాల్లో అనధికారికంగా గ్రావెల్ తరలిస్తున్నారని, ఈ ప్రాంతాల్లోని వీఆర్‌వోలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గ్రావెల్ తరలించే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయాలని తహసీల్దార్ టి.గోవింద ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొండను త్రవ్వి గ్రావెల్ తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

బీచ్‌లో బెంచీలు ధ్వంసం



ఆకతాయిలు ధ్వంసం చేసిన బెంచీ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి రామాద్రి బీచ్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. పర్యాటకులు సేద తీరేందుకు ఇక్కడ బెంచీలు ఏర్పాటు చేశారు. అయితే కొందరు ఆకతాయిలు ఒక బెంచీని పూర్తి స్థాయిలో ధ్వంసం చేసి, మరికొన్నింటిని పాక్షికంగా ధ్వంసం చేశారు. ఇలాంటి ఆకతాయిలపై అధికారులు నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు



శ్రీ శృంగేరి మఠంలో సుబ్రహ్మణ్య స్వామి

పీఎం పాలెం : పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెంలో గల శ్రీ శృంగేరీ శంకర మఠం ఆలయ సముదాయంలో కొలువుతీరిన శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా ఆలంకరించి విశేష అర్చనలు నిర్వహించారు. శ్రీ శృంగేరీ శంకర మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పీఎం పాలెం : జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరదేశిపాలెంకు చెందిన జామి అప్పలరాజు, అతని భార్య ద్విచక్ర వాహనంపై ఆనందపురం వైపునకు వెళ్తుండగా... అదే రోడ్డులో వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొట్టిన వాహనం డ్రైవర్ ఆ సమయంలో మద్యం సేవించి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. బాధితుని అల్లుడు కోరాడ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆహ్లాదం... ఆనందం

- సుమారు రూ.6 కోట్లతో థీమ్ పార్కుల అభివృద్ధి
- మధురవాడలో పిల్లలు, పెద్దలతో కిటకిట



కొమ్మాది పెట్రోల్ బంక్ వెనుక పిల్లలతో కిటకిటలాడుతున్న పార్కు



పీఎంపాలెం థీమ్ పార్కులో యోగా చేస్తున్న పెద్దలు



బక్కన్నపాలెం స్పోర్ట్స్ థీమ్ పార్కులో అధునాతన ఫ్లోరింగ్‌తో బాస్కెట్ బాల్ కోర్టు

మధురవాడ : ప్రభుత్వం ముందు చూపుతో సంరక్షణ చర్యలు చేపట్టి, కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన పార్కులు ఈ వేసవి సెలవుల్లో పిల్లలతోపాటు పెద్దలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతున్నాయి. ఎక్కడ చూసినా పార్కులన్నీ పిల్లలు, పెద్దలతో కిటకిటలాడుతున్నాయి. ఒకప్పుడు సాయంకాలం, ఉదయం సమయాల్లో పెద్దలు వ్యాయామం, పిల్లలు ఆటలాడుకోవడానికి కనీస సదుపాయాలు లేక ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మధురవాడలో సుమారు రూ.6 కోట్లతో మూడు థీమ్ పార్కులు అత్యంత సుందరంగా నిర్మించారు. అలాగే స్వతంత్రనగర్‌లో పార్కులు అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఉపయోగంలోకి తీసుకొచ్చారు. వీటితోపాటు ఏళ్ల తరబడి పట్టించుకోకుండా ఆక్రమణపాలైన ఓపెన్ స్పేస్‌లతోపాటు వుడా అప్రూవ్డ్ లే అవుట్‌లలో కేటాయించిన, ఇతర ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లోని 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని మారికవలస, పరదేశిపాలెం, కొమ్మాది జంక్షన్, టీచర్స్ లే అవుట్, కళానగర్, మిథిలాపురి వుడా కాలనీ, బింద్రానగర్, పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో అనేక పార్కులను కోట్లాది రూపాయలతో పరిరక్షించి అభివృద్ధి చేశారు. వీటిలో అత్యధిక పార్కులు సాయంత్రమయ్యేసరికి పిల్లలు, పెద్దలతో కళకళలాడుతున్నాయి.



బక్కన్నపాలెం స్పోర్ట్స్ థీమ్ పార్కులో పచ్చదనం



స్వతంత్రనగర్ పార్కులో సిద్ధం చేసిన ఆడిటోరియం



మధురవాడలోని ఓ పార్కులో ఆటలాడుకుంటున్న పిల్లలు

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



వివిధ రకాల పువ్వులతో రాస పోలమాంబ



కొత్త వస్త్రాలు, ఆభరణాలతో కొత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం తులసి మాలలు, సంపంగి, బొగడ, జరపర, డిసెంబర్, మల్లె పువ్వులు, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గుడ్డాల రాంబాబు, రమ్య సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదం అందించారు. జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని నూతన వస్త్రాలు, ఆభరణాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు.

పీఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస : నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల 18, 19న నిర్వహించిన తకాషి మసుయామా కప్ గ్రాండ్ మాస్టర్ ఇన్విటేషనల్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మిపురం పీఎన్ఆర్ మార్షల్ అసోసియేషన్ విద్యార్థులకు పతకాలు లభించాయి. కోచ్ కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు కాటా, కుమిటి పోటీల్లో పతకాలు సాధించారు. వీరిలో టి.తరుణ్ శేఖర్ బంగారు, రజత పతకాలు, ఎస్.మహీధర్ రజతం, కాంస్య పతకాలు, ఎస్.అభిషేక్ బంగారు, కాంస్య పతకాలు, టి.వెంకట సాయి వర్షిత్ రెండు బంగారు, పి.హర్షవర్ధన్ రెండు కాంస్య, బి.సాయిచరణ్ రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు కోచ్‌ను భీమిలి అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

స్కూళ్ల ప్రారంభం తర్వాతే అడ్మిషన్లు

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సోమయాజులు



చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



పాఠశాలలో సువిశాల పరిసరాలు

మధురవాడ : పాఠశాలల పునః ప్రారంభం తర్వాతే చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమయాజులు చెప్పారు. ఆన్‌లైన్ ప్రక్రియలో వస్తున్న మార్పుల వల్ల విద్యార్థులు గతంలో ఏ పాఠశాలలో చదివారో అక్కడి యాజమాన్యం సంబంధిత వివరాలు నమోదు చేయాల్సి వుంటుందన్నారు. ఇక్కడ కూడా ఆయా వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి వుందన్నారు. అందువల్ల పాఠశాలల ప్రారంభం తర్వాతనే అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు చెప్పారు. చంద్రంపాలెం హైస్కూల్‌లో చేరాలనుకునే విద్యార్థులు పాఠశాల ప్రారంభం తర్వాత సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆలస్యమైతే చేరికలపై ప్రభావం

రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏటా వెయ్యి మందికి పైగా కొత్త విద్యార్థులు చేరుతున్నారు. కరోనా సమయంలో కూడా ఇదే తరహాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చి చేరారు. అనేక ఏళ్లుగా ఇక్కడి యాజమాన్యం వేసవి సెలవుల నుంచే అడ్మిషన్స్ ప్రక్రియ చేపడుతూ వస్తున్నారు. పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంగ్లిష్ మీడియం, జగనన్న గోరుముద్ద, జేవీకే కిట్స్, డిజిటల్ విద్యా విధానం వంటివి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మరింతగా ఆకట్టుకుంటున్నాయి. పైగా ఇక్కడ చదువుకునే విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతుండడంతో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా వచ్చి చేరుతున్నారు. అడ్మిషన్స్ ఆలస్యంగా ప్రారంభిస్తే ఇక్కడ చేరాలనుకునే విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు, ఇతర పాఠశాలలకు వెళ్లిపోయే అవకాశం వుందని పలువురు అంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అడ్మిషన్స్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

తగరపువలస : భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆదిశంకరాచార్యులు జీవిత చరిత్రపై తెలుగు, హిందీ మాధ్యమాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు గురువారం బహుమతులు అందించనున్నారు. వివరాలకు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు 89856 47419, 89858 97419ను సంప్రదించాలని కోరారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



ఉప్పపేటలో పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలస అనిట్స్ కళాశాల రహదారిలో ఉప్పపేట వద్ద పగిలిన పైప్‌లైన్‌కు సిబ్బంది మంగళవారం మరమ్మతులు పూర్తి చేశారు. 'నాలుగు రోజులుగా తాగునీరు వృథా' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన వార్తకు తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది స్పందించి మరమ్మతులు పూర్తి చేశారు.

బాలుడి వైద్యానికి రూ.2 లక్షల సాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న హర్షిణి, తదితరులు

దాతల సాయం కోసం దుర్గాప్రసాద్ వేడుకోలు

తగరపువలస : అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్యానికి పలువురు దాతలు చేయూత అందిస్తున్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి పంచాయతీ ముమ్మనవానిపాలెం గ్రామానికి చెందిన 18 ఏళ్ల రాజాన దుర్గాప్రసాద్ ఈ నెల 10న తాటిచెట్టు పైనుంచి పడిపోవడంతో వైద్యులు బ్రెయిన్‌కు శస్త్రచికిత్స చేసినా ఇప్పటికీ అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. విశాఖలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఇంకా రూ.10 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. పేదవారైన తల్లిదండ్రులు గంగమ్మ, అప్పలరాజు వేడుకోలుతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్పందిస్తున్నారు. ముమ్మనివానిపాలెం గ్రామాన్ని ఆనుకుని ఆనందపురం మండలానికి చెందిన రామవరం పంచాయతీ ఉంది. ఈ గ్రామానికి చెందిన గంట్రెడ్డి హర్షిణి చొరవ తీసుకుని పంచాయతీలోని దాతల సాయంతో బాలుని చికిత్స కోసం తల్లిదండ్రులకు మంగళవారం రూ.2 లక్షలు అందించింది. ఆమే కాకుండా ఆనందపురం మండలంలోనే భీమందొరపాలెం, కోలవానిపాలెం పంచాయతీ వాసులు, బాలుని సొంత గ్రామమైన ముమ్మనివానిపాలెం గ్రామస్తులు కూడా స్పందించి తలో కొంత నగదు సాయం అందిస్తున్నారు. ఇంకా దుర్గాప్రసాద్ వైద్యానికి సాయం అందించాలనుకునే వారు 91770 69270, 94949 19627 లో సంప్రదించాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సినేషన్

మధురవాడ : అన్ని సచివాలయాల్లో ప్రతీ గురువారం టీబీ నిర్మూలనకు బీసీజీ టీకాలు వేస్తారని, అంతా సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ వీర బ్రహ్మం సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మధురవాడ టీబీ యూనిట్ పరిధిలోని మధురవాడ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు సాగర్‌నగర్, రుషికొండ, పీఎంపాలెం, వాంబేకాలనీ, స్వతంత్రనగర్, మిథిలాపురి ఉడా కాలనీ, విశాలాక్షినగర్, మారికవలస, బక్కన్నపాలెం తదితర 10 యూపీహెచ్‌సీల పరిధిలో వ్యాక్సిన్ వేస్తారన్నారు. పై ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైతే తమను సంప్రదించాలని కోరారు. ఇతర సచివాలయాల్లో కూడా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. ముఖ్యంగా పొగ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎమ్ఐ (బాడీ మాస్ ఇండెక్స్) 18 కన్నా తక్కువ ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణంతో తొలగిన సమస్యలు



గతంలో రోడ్డుపై అధ్వానంగా మురుగునీరు



రూ.30 లక్షలతో సుందరంగా నిర్మించిన రోడ్డు

భీమునిపట్నం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో భీమిలి చిన్నబజారు ప్రాంతం, కొంకి వీధి వాసుల దీర్ఘకాలిక సమస్య తీరింది. ఈ ప్రాంతం నుంచి దుర్గాశ్రమం మీదుగా కొంకువీధికి వెళ్లే ప్రధాన రోడ్డు ఉంది. ఈ రోడ్డు ఒక చోట బాగా కుంగిపోవడంతో పక్కనే ఉన్న మురుగు కాలువలోని నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీనివల్ల ఆ ప్రాంతమంతా బురదమయంగా మారడంతోపాటు దుర్వాసనతో పరిసరాలు అధ్యానంగా తయారయ్యేవి. రోజూ ఈ మార్గంలో పెద్ద ఎత్తున రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక వర్షాలు కురిసే సమయాల్లో పరిస్థితి మరింత అధ్యానంగా ఉండేది. దీనిపై గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతీయులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

రూ.30 లక్షలతో కొత్త రోడ్డు నిర్మాణం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి అంచనాలు రూపొందించారు. ఆ మేరకు కొద్ది రోజుల్లోనే ఇందు కోసం రూ.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వెంటనే అధికారులు జాప్యం చేయకుండా పనులు ప్రారంభించి కుంగిపోయిన చోట ఎంతో నాణ్యతో కూడిన ఎత్తైన సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతోపాటు పక్కనే దెబ్బతిన్న కాలువకు కూడా మరమ్మతులు పూర్తి చేశారు. ఇంతవరకు దారుణంగా ఉన్న రోడ్డు రూపురేఖలే మారిపోయి సుందరంగా తీర్చిదిద్దడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోండి



అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపునకు రీజినల్ లేబర్ కమీషనర్ (ఆర్ఎల్‌సీ) చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం వారు ఆర్ఎల్‌సీ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీ వచ్చినప్పటికి కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో పాటు డిఫాల్టర్లుగా మిగులుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపుపై యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు గళ్లా శంకర్ సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేశారు.

అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి : అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్ష అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి సంకీర్తనలను అంకితం చేసి కైవల్యం పొందారన్నారు. నేటి సమాజంలో సనాతన ధర్మం, భక్తి భావన దూరం అవుతున్నాయని, ఈ క్రమంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.